

మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు ఎంఏ.గఫూర్

ఉల్లి రైతులకు పరిహారమేది..?

-ఖరీఫ్ సీజన్‌లో తీవ్రంగా నష్టపోయిన రైతులు
-పెట్టిన పెట్టుబడి చేతికి రాని దుస్థితి

ప్రజాశక్తి-పత్తికొండ

ఖరీఫ్ సీజన్‌లో ఉల్లిసాగు చేయడానికి పెట్టిన పెట్టుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట చేతికొచ్చే సమయానికి గిట్టుబాటు ధర లేక పంటను పొలాల్లోని వదిలేశామంటూ మరి కొంతమంది రైతులు తెలిపారు. పత్తికొండ ఉద్యానవన శాఖ పరిధిలోని ఖరీఫ్ సీజన్‌లో దేవనకొండ 4607ఎకరాలలో, పత్తికొండ 9339, తుగ్గలి 2272, మద్దికేర 3066 ఎకరాలలో ఉల్లి సాగు నమోదు అయినట్లు అధికారికి లెక్కలు చెబుతున్నాయి. ఉల్లి పంటను నాలుగు నెలలు రేయింబవళ్లుకంటికి రెప్పలా కాపాడుకున్నా గిట్టుబాటు ధర లేకపోవడంతో అల్లాడుతున్నామని రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఉల్లికి గిట్టుబాటు ధర క్వింటాలుకు రూ.1200 కల్పించిన వ్యవసాధికారులు ఏ రైతుకు అవగాహన కల్పించిన దాఖలు లేవు. రైతులను దృష్టిలో ఉంచుకొని హెక్టార్ కు రూ.50,000 నష్టపరిహారం అందిస్తామని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పిన మాటలు నేటికీ అమలుకు నోచుకోలేదని రైతులు చెబుతున్నారు. పంట సాగు చేయడానికి చేసిన అప్పులు తీర్చుకోవడానికి ఉపయోగపడతాయని రైతులు చెబుతున్నారు. పిల్లాపాపలను బతికించుకోవాలంటే సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్లాల్సిన పరిస్థితి ఉందని అంటున్నారు. ఏమి చేయాలో తెలీక దిక్కు తోచని స్థితిలో రైతులు ఉన్నారు.

ఉల్లిని గ్రేడింగ్ చేస్తున్న దృశ్యం

ప్రభుత్వానికి నివేదిక పంపించాం

ఉల్లి సాగుచేసిన రైతుల నివేదికను ప్రభుత్వానికి పంపించాం. ప్రభుత్వం నిధులు విడుదల చేసిన వెంటనే రైతుల ఖాతాలోకి నష్టపరిహారం జమవుతుంది. ఏ రైతు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

- పత్తికొండ హార్టికల్చర్ అధికారి రఘువరన్.

తక్షణమే రైతు ఖాతాలోకి జమ చేయాలి

ఉల్లిసాగుచేసిన రైతులు గిట్టుబాటు ధర లేక, పంటలను పంట పొలాల్లోనే వదిలేశారు. ఏమి చేయలేని దిక్కుతోచని స్థితిలో రైతులు ఉన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం చెప్పిన హెక్టార్ రూ.50వేల నష్టపరిహారం రైతుల ఖాతాలో జమ చేయాలి.

- ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి సిద్దు.

ఉల్లి పరిహారం కోసం ఎదురుచూస్తున్నాం

నాలుగు ఎకరాలలో ఉల్లిసాగు చేశాను. సాగు చేసిన పెట్టుబడి, కూలి ఖర్చులు కూడా రాలేదు. రాష్ట్ర ప్రభుత్వం అందించే పరిహారం వస్తే కొంతవరకు ఉపయోగపడుతుంది.

రైతు రామాంజనేయులు హొసూరు గ్రామం,పత్తికొండ మండలం.

మహిళా మార్ట్‌కు డబ్బులను చెల్లించాలి

-సిఐటియు జిల్లా అధ్యక్షుడు పిఎస్ రాధాకృష్ణ
-కలెక్టరేట్ ఎదుట మెప్మా ఆర్పీల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జగనన్న మహిళా మార్ట్ ఏర్పాటుకు పొదుపు మహిళల నుండి రూ.66 లక్షలు వసూలు చేసిన డబ్బులు తిరిగి చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు పిఎస్ రాధాకష్ణ డిమాండ్ చేశారు. మెప్మా ఎల్‌హెచ్ జిలాని, అప్పటి పిడి నాగశివలీల అక్రమాలపై వెంటనే విచారించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట మెప్మా ఆర్‌పిలు చేపట్టిన ధర్నాలో పిఎస్ రాధాకృష్ణ మాట్లాడారు. మహిళా మార్ట్ ఏర్పాటు చేసినప్పుడు సభ్యుల ప్రమేయం లేకుండా ఆర్‌పిలపై ఒత్తిడి తెచ్చి రూ.లక్షల డబ్బులు వసూలు చేశారన్నారు. నిర్వహణ పద్ధతుల విస్మరించి మహిళల సొమ్మును కొల్లగొట్టిన వారిపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌పిల గ్రేడింగ్ విధానం రద్దుచేసి కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలన్నారు. ఎపి మెప్మా ఆర్పుల సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు పి రుద్రమ్మ, ఎస్.ఉమాదేవి, జిల్లా కోశాధికారి సుజాత ప్రసాద్, జిల్లా నాయకులు కన్యక ,మహాలక్ష్మి, మంజుల నగర నాయకులు బి.జ్యోతి పర్వీన్, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు శ్యామల, నగర అధ్యక్షురాలు కుమారి, పొదుపు మహిళలు, ఆర్పీలు పాల్గొన్నారు.

నిరసననుద్దేశించి మాట్లాడుతున్న పిఎస్ రాధాకృష్ణ

తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళిక

- జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ సిరి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : జిల్లాలో రాబోయే వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి నివారణకు ప్రణాళిక రూపొందించుకోవాలని సంబంధిత శాఖ అధికారులను జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.సిరి పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్లోని సునయన ఆడిటోరియంలో ప్రజా సమస్యలు పరిష్కార వేదిక గ్రీవెన్స్ నిర్వహించారు. గ్రీవెన్స్‌లో బాధితుల నుండి వచ్చిన వినతలను నేరుగా జిల్లా కలెక్టర్ స్వీకరించి వాటిపై జిల్లా అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పెండింగులోని పిజిఆర్ఎస్ దరఖాస్తులను త్వరగా పరిష్కరించాలన్నారు. అన్ని హాస్పిటల్స్‌లో ఎన్‌టిఆర్ వైద్య సేవకు సంబంధించి కంట్రోల్ రూమ్ నెంబర్ ప్రదర్శించాలన్నారు. జాయింట్ కలెక్టర్ నూరుల్ కమర్, డిఆర్ఓ సి.వెంకట నారాయణమ్మ, హౌసింగ్ పిడి చిరంజీవి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనురాధ, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న పుల్లారెడ్డి

హెచ్‌ఆర్ పాలసీ అమలు చేయాలి

-కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

సమగ్ర శిక్షలో పనిచేసే కాంట్రాక్ట్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులకు హెచ్‌ఆర్ పాలసీని అమలు చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట సమగ్ర శిక్ష అభియాన్ కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగుల జెఎసి ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ ధర్నాలో పాల్గొన్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి అంజిబాబు, జెఎసి చైర్మన్ చంద్రశేఖర రాజు మాట్లాడుతూ గతంలో సమ్మె సందర్భంగా చేసుకున్న ఒప్పందాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవులను ఇవ్వాలన్నారు. మినిమం టైమ్ స్కేల్ కింద వేతనాలు చెల్లించాలన్నారు. ఖాళీ పోస్టులను కూడా వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నిటిని పరిష్కరించకపోతే రాబోయే కాలంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జెఎసి నాయకులు సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న నాయకులు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు

రాయలసీమలో ప్రాజెక్టులు పూర్తి చేయాలి

- గుండ్రేవుల పనులను వెంటనే ప్రారంభించాలి
- సిపిఎం కేంద్ర కమిటీ మాజీ సభ్యులు ఎంఏ గఫూర్
- కెపిఎస్ ఆధ్వర్యంలో 48 గంటల జల సమర దీక్ష

రాయలసీమలోని సాగునీటి ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కర్నూలు మాజీ ఎమ్మెల్యే ఎంఏ.గఫూర్ డిమాండ్ చేశారు. గుండ్రేవుల ప్రాజెక్టు పనులను వెంటనే ప్రారంభించేందుకు నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎం.శ్రీహర్ష ఆధ్వర్యంలో గుండ్రేవుల ప్రాజెక్టు చేపట్టాలని కోరుతూ సోమవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ సర్కిల్లోని ధర్నా చౌక్‌లో 48 గంటల జల సమర దీక్ష ప్రారంభించారు. ఈ దీక్షా శిబిరాన్ని ఎంఏ.గఫూర్ సందర్శించి మద్దతు తెలిపారు. (వార్త మెయిన్ పేజీలో..)

జిజిహెచ్‌లో పేపర్ లెస్ సేవలు

- పరీక్షలు, మందుల కోసం బయటకు పంపరాదు
- ఉత్తమ వైద్య సేవలు అందించాలి
-పరిశ్రమల శాఖ మంత్రి టిజి భరత్

ప్రజాశక్తి - కర్నూలు హాస్పిటల్

కర్నూలు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పేపర్ లెస్ సేవలు అందుబాటులోకి తీసుకు రావాలని , రోగులకు పరీక్షలు , మందులకు బయటకు రెఫర్ చేయరాదని వారికి ఉత్తమ వైద్య సేవలు అందించాలని పరిశ్రమలు,ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఉదయం కర్నూలు సర్వజన ఆసుపత్రి , మెడికల్ కాలేజీ అభివృద్ధి కమిటీ సమావేశంలో మంత్రి మాట్లాడారు. నెక్స్ట్ జనరేషన్ సాఫ్ట్వేర్ ను వినియోగించి ప్రభుత్వ ఆసుపత్రిలోని అన్ని సేవలు పేపర్ లెస్ గా అందించే చర్యలు తీసుకోవాలన్నారు. అందుకు అవసరమైన కంప్యూటర్లు , ప్రింటర్లు , నైపుణ్యం సమకూర్చుకోవడానికి , సాఫ్ట్‌వేర్‌పై అవగాహన కల్పించే చర్యలు తీసుకోవాలని ఎన్ఐసి డిఇఒ ప్రవీణ్ రెడ్డిని మంత్రి ఆదేశించారు. ఎటువంటి పరిస్థితుల్లోనూ రోగులకు అన్ని పరీక్షలు, మందులు ఆసుపత్రిలోనే ఏర్పాటు చేయాలన్నారు. విదేశాల్లో ఉన్న కర్నూలు కాలేజ్ లో చదివిన డాక్టర్లు రూ.50 కోట్లు వెచ్చించి నాలెడ్జ్ సెంటర్‌ను స్థాపించడానికి ముందుకు వచ్చారని వారికి అనుకూలమైన ప్రదేశంలో స్థలాన్ని కేటాయించాలన్నారు. మెడికల్ కాలేజీ యాజమాన్యం , సిబ్బంది, విద్యార్థులు పూర్తిగా సహకరించాలని మంత్రి కోరారు. వేల మందికి వైద్య సేవలు అందిస్తున్న కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి ఒక ఎలక్ట్రికల్ ఇంజనీర్‌ను కేటాయించాలని ఎపిఎస్‌పిడిసిఎల్ ఎస్ఇ ప్రదీప్ కుమార్‌ను మంత్రి ఫోన్ ద్వారా ఆదేశించారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడినప్పుడు జనరేటర్లు ఆటోమేటిక్‌గా పనిచేసి విద్యుత్ అందించే చర్యలు సమర్ధవంతంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఐసియులో ఉన్న ఎయిర్ కండిషన్ యూనిట్ల వివరాలు వాటి మెయింటినెన్స్ విషయాలు, ఆసుపత్రికి కావలసిన కంప్యూటర్లు , ప్రింటర్లు , కంటి ఆసుపత్రికి కావలసిన ఒటిఎస్ మిషన్ , క్యాన్సర్ ఆసుపత్రికి రావలసిన రూ.20 కోట్ల బడ్జెట్ , పవర్ గ్రిడ్ కార్పొరేషన్ ద్వారా రోగుల సహాయకులకు నిర్మించ తలపెట్టిన విశ్రాంతి భవనం , అనస్థీషియా వర్క్ స్టేషన్ల ఏర్పాటు, రోస్టర్ పాయింట్ల ప్రకారం చేస్తున్న నియామకాల విషయాలు నివేదిక రూపంలో సమర్పించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లును ఆదేశించారు. వెహికల్ పార్కింగ్, సిసిటివి కెమెరాలు, ఆక్సిజన్ సప్లై పైపులు ఏర్పాటు, ఆసుపత్రిలో జంగిల్ క్లియరెన్స్ పనులు, 50 పడకల క్రిటికల్ కేర్ వార్డ్ పనుల గురించి మంత్రికి డాక్టర్ వెంకటేశ్వర్లు వివరించారు. టీజీవి ఫౌండేషన్ ద్వారా రూ.41 లక్షల సిఎస్ఆర్ ఫండ్స్ ద్వారా కేటాయించి నాలుగు అత్యాధునిక సౌకర్యాలు కల పేయింగ్ బ్లాకు రూములను నిర్మాణం చేసి ఆసుపత్రికి అందించినందుకు మంత్రి టిజి. భరత్ కు కృతజ్ఞతలు తెలిపారు. మెడికల్ కాలేజ్ ప్రిన్సిపల్ చిట్టి నరసమ్మ , ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వర్లు, క్యాన్సర్ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ ప్రకాష్, ఆసుపత్రి డెవలప్మెంట్ కమిటీ సభ్యులు డాక్టర్ ప్రవీణ్, రఘునాథ్ రెడ్డి, జగదీష్, ప్రదీప్, ఎపిఎంఐడిసి సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

ఫిర్యాదులను స్వీకరిస్తున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్

విచారించి న్యాయం చేస్తాం

- ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : ఫిర్యాదుల పరిష్కార వేదికకు అందిన ఫిర్యాదుల పై విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తామని ఎస్‌పి విక్రాంత్ పాటిల్ తెలిపారు. కర్నూలు క్యాంపు కార్యాలయంలో కర్నూలు జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్ సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు వచ్చిన ప్రజల సమస్యల వినతులను స్వీకరించి ఫిర్యాది దారులతో జిల్లా ఎస్‌పి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు మొత్తం 95 ఫిర్యాదులు వచ్చాయి.అడిషనల్ ఎస్‌పి హుస్సేన్ పీరా, సిఐలు శివశంకర్, రామకృష్ణ, విజయలక్ష్మి లు పాల్గొన్నారు.

జీవనశైలి మార్పులతోనే రక్తపోటు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : కల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గోకులపాడు గ్రామంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని సోమవారం జిల్లా సంచార చికిత్స కార్యక్రమ నోడల్ అధికారి డాక్టర్ రఘు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ జీవనశైలిలో మార్పులే రక్తపోటుకు కారణమని, సరైన ఆహారపు అలవాట్లు వ్యాయమంతో రక్తపోటుకు దూరంగా ఆరోగ్యంగా జీవించ వచ్చునని అన్నారు. రక్తపోటును ఎప్పటికప్పుడు పరీక్షించుకోవాలన్నారు. రక్తపోటు పెరిగితే పక్షవాతం గుండెపోటు వచ్చే అవకాశం ఉందన్నారు. మద్యపానం, ధూమపానం, కొవ్వు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ప్రతిరోజు వ్యాయామం చేయడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చునని అన్నారు. ఉప్పు తక్కువగా ఉండే ఆహార పదార్థాలు వినియోగించుకోవాలన్నారు. పాలు, గుడ్లు, పండ్లు, పొడి ధాన్యాలు, ఆకుకూరలు తదితర పోషక విలువలు కలిగిన ఆహారాలు తీసుకోవాలన్నారు. రక్తపోటు నివారణ లక్షణాలు చికిత్స తదితర అంశాలపై అవగాహన కల్పించారు. సామాజిక ఆరోగ్య అధికారి చందన, మగ ఆరోగ్య కార్యకర్త హీరాలల్, ఆశా కార్యకర్తలు , ఖలీల్ పాల్గొన్నారు.

ఎన్‌సిసి విద్యార్థుల సైకిల్ ర్యాలీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : ఎన్‌సిసిడే వారోత్సవాల ముగింపు సందర్భంగా సోమవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల , 28వ ఆంధ్ర బెటాలియన్ సంయుక్తంగా ఎన్‌సిసిసి విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం. ఇందిరా శాంతి, లెఫ్టినెంట్ కల్నల్ శశి కుమార్, ఎన్‌సిసి ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ ఆర్కే నాయక్ లు ప్రారంభించారు. కార్యక్రమం లో వైస్ ప్రిన్సిపల్స్ జె. హేమంత్, ఎ. సత్యనారాయణ, ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డి,

చిరుధాన్యాలతో గణనీయమైన మార్పు

- సదస్సులో డాక్టర్ ఖాదర్ వలీ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రోజువారి జీవనశలిలో చిరుధాన్యాల వినియోగం ద్వారా గణనీయమైన మార్పు వస్తుందని పద్మశ్రీ డాక్టర్ ఖాదరవలి అన్నారు. సోమవారంకర్నూలు నగరంలోని స్థానిక టీజీవి కళాక్షేత్రంలో అదితి చిరుధాన్యాల ఆధ్వర్యంలో మిల్లెట్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథి పద్మశ్రీ డాక్టర్ ఖాదరవలి పాల్గొని ప్రసంగించారు. చిరుధాన్యాల్లో గట్ మైక్రోబ్స్‌ను పెంచే సహజ గుణాలు, అధిక ఫైబర్, రక్తంలో ఏర్పడే లిథిక్కెనింగ్ (రక్తం గడ్డ కావడం)లను తగ్గించే లక్షణాలను వివరించారు. చిరుధాన్యాలు రోజువారీ ఆహారంలో భాగం అయితే జీవనశైలిలో గణనీయమైన మార్పు వస్తుందని సూచించారు. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి మాట్లాడుతూ , ఆరోగ్యం కోసం చిరుధాన్యాల వినియోగం పెరగాల్సిన అవసరాన్ని చెప్పారు. చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు విజయ్ కుమార్ రెడ్డి, టిజి. జగదీష్ , అదితి మిల్లెట్స్ వ్యవస్థాపకులు సిప మోహన్ కడింపల్లి, పోతుల శేఖర్ మాట్లాడుతూ, సంస్థకు కర్నూలులోనే సొంతంగా మిల్లెట్ ప్రాసెసింగ్ యూనిట్ ఉండి, 200 మంది రైతులతో పని చేస్తూ, ప్రాసెస్ చేసి చిరుధాన్యాలను దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంచేందుకు ఇటువంటి కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తామని అన్నారు.

మాట్లాడుతున్న డాక్టర్ ఖాదర్‌వలి

అంగన్‌వాడీ సెంటర్‌ను బలోపేతం చేయండి

- సిఐటియు డిమాండ్

ప్రజాశక్తి - కోడుమూరు

అంగన్వాడి వర్కర్స్ సమస్యలపై కోడుమూరు తహశీల్దార్ కార్యాలయం ఎదుట ప్రాజెక్టు కార్యదర్శి సూలమ్మ అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ఈ ధర్నానుద్దేశించి సిఐటియు మండల కార్యదర్శి గఫూర్ మియా మాట్లాడారు. అంగన్వాడి కార్యకర్తలు చాలీచాలని జీతంతో తమ కుటుంబాలను పోషించలేక పెరిగిన నిత్యవసర వస్తువుల ధరల వల్ల చాలా ఇబ్బందులు పడుతున్నారన్నారు. దానికి తోడుగా రాష్ట్ర ప్రభుత్వం రకరకాల మొబైల్ యాప్స్ తీసుకుని వచ్చి వేధింపులకు గురి చేస్తున్నారన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు పోటీపడి మరి మూడు నుండి ఐదేళ్లలోపు పిల్లలను తక్కువ ఫీజు తీసుకుంటామని తల్లిదండ్రులను మభ్యపెట్టి ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించుకుంటున్నారన్నారు. వాటి కారణంగా అంగన్వాడి కేంద్రాల్లో ఉండాల్సిన మూడు నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలు సెంటర్స్‌లో తగ్గిపోతున్నారు. రోజురోజుకు అంగన్వాడి కేంద్రాలు పిల్లలు తగ్గి బోసిపోతున్నాయన్నారు. దాదాపుగా 11 సంవత్సరాల నుండి ఒక్క పైసా కూడా జీతం పెంచలేదు. కనీసం అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తుంది. జీవో ప్రకారం రూ.26 వేల వేతనం ఇవ్వాలన్నారు. ఇఎస్ఐ, పిఎఫ్ సౌకర్యం కల్పించి నాలుగవ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని ప్రస్తుతం ఉన్న యాప్‌లన్నీ తగ్గించి ఒకటే యాప్ కింద తీసుకొని రావాలి నాణ్యమైన మొబైల్ ఫోన్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని తహశీల్దార్ కార్యాలయంలో అధికారికి అందజేశారు. సిఐటియు నాయకులు జిపి.వీరన్న, కుమారస్వామి, అంగన్వాడి నాయకురాలు అరుణ, నాగమ్మ, భాగ్యమ్మ, రజియా, హైమావతి కోడుమూరు పట్టణంలోని అంగన్వాడీ కార్యకర్తలు అందరూ పాల్గొన్నారు.

రాద్ధాంతం చేస్తే కర్ర తీసుకోవాల్సి వస్తుంది

-ఎబిసి క్యాంపుల్లో హైకోర్టు బెంచ్ తప్పనిసరి
- ప్రతిపక్షాలపై మంత్రి టిజి భరత్ ఘాటు వ్యాఖ్యలు

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

కర్నూలు నగరంలో ఎబిసి క్యాంపు ప్రభుత్వ క్వార్టర్స్ ల్లో హైకోర్టు బెంచ్ ఏర్పాటు తప్పనిసరి అని, దాన్ని ఎవరైనా అడ్డుకోవాలని చూస్తే కర్ర పట్టుకోక తప్పదని, దాని జోలికి వెళ్లి చేతులు కాల్చుకోవద్దని ఘాటైన వ్యాఖ్యలను ప్రతిపక్షాలను ఉద్దేశించి పరిశ్రమలు, వాణిజ్య ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి.భరత్ అన్నారు. సోమవారం కర్నూలు నగరంలో మెడికల్ కళాశాలనుంచి పాషా మసీదు వరకు ఇటీవల పూర్తి చేసిన రోడ్డు వైడనింగ్ పనులను ఎంపీ బస్తిపాటి నాగరాజు, కూడా చైర్మన్ సోమిశెట్టి వెంకటేశ్వర్లు, మున్సిపల్ కమిషనర్ విశ్వనాథ్, డిఎండబ్ల్యుఒ సబిహ పర్వీన్ తో కలిసి ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. ఈ రోడ్డు వైడనింగ్ పనులు ప్రారంభానికి ముందు ఎంతోమంది అమాయకులు యాక్సిడెంట్లకు గురై ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ పనిని పూర్తి చేయడానికి మున్సిపల్ కమిషనర్, అందరి అధికారుల సహకారం ఇందులో ఉందన్నారు. నగరంలో పలుచోట్ల రోడ్ల వైడనింగ్ పనులను చేపట్టాల్సిన అవసరం ఉందన్నారు. రోజురోజుకు జనాభాతో పాటు వాహనాలు ట్రాఫిక్ సమస్య పెరుగుతుందన్నారు. భవిష్యత్తులో వాటిని స్థానికులతో చర్చించి సమస్యను సున్నితంగా పరిష్కరించేందుకు కషి చేస్తామన్నారు. కర్నూలు నగరానికి హైకోర్టు బెంచ్ రావాల్సిందేనని నొక్కి వక్కాణించారు. దీనిపట్ల ప్రభుత్వం సానుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. ఇప్పటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, గవర్నర్ కూడా స్వయంగా తనతో స్పందించారన్నారు. నగర హృదయ భాగంగా ఉన్న ఏబిసి క్యాంపుల్లోనే బెంచును ఏర్పాటు చేయాలని సూచించారన్నారు. దీన్ని అడ్డుకోవడానికి స్థానికులు, ప్రతిపక్షాలను సంప్రదిస్తున్నారని, ప్రభుత్వం చేసే మంచి పనికి అడ్డు పడి చేతులు కాల్చుకోవద్దని అన్నారు. కాదని అడ్డుపడితే కర్ర తీసుకోవాల్సి వస్తుందని ఘాటుగా హెచ్చరించారు. మార్చి నాటికే ఖాళీ చేస్తామని తమకు రాతపూర్వకంగా రాసిచ్చారని, ఇచ్చిన గడువు తీరిపోయిందని వెంటనే ఖాళీ చేయాలని, ఆక్రమిస్తామంటే ఊరుకోబోమని హెచ్చరించారు. ఎంపీ బస్తిపాటి నాగరాజు, మునిసిపల్ కమిషనర్ విశ్వనాథ్ మాట్లాడుతూ.. మనసు ఉద్దేశం మంచిదైతే సంకల్పం సులభంగా నెరవేరుతుందన్నారు. రోడ్డు వైడనింగు పని దాన్ని రుజువు చేసిందన్నారు. భిన్నత్వంలో ఏకత్వం అన్న దాన్ని నగర ప్రజలు రుజువు చేశారన్నారు. మంత్రి అన్ని విధాల సహకరిస్తూ సమస్యను సున్నితంగా పరిష్కరించేందుకు కషి చేశారన్నారు. కార్పొరేషన్ చైర్మన్ సింగ్, హజ్ కమిటీ మెంబర్ మన్సూర్ అలీ ఖాన్, కార్పొరేటర్లు రామాంజనేయులు, అబ్బాస్, కురువ పరమేష్, పామయ్య, పద్మలత రెడ్డి, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ సభ్యులు కొంకతి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మంత్రి టీజీ భరత్

కలెక్టరేట్‌ఎదుట ధర్నా నుద్దేశించి మాట్లాడుతున్న ప్రసాద్‌శర్మ

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

- మెడికల్ రెప్స్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని ఎపి మెడికల్ సేల్స్ అండ్ రిప్రజెంటేటివ్స్ యూనియన్ రాష్ట్ర ఉపా అధ్యక్షులు– కోటేశ్వర్‌రావు, రాష్ట్ర కమిటీ సభ్యులు సురేంద్ర, జిల్లా అధ్యక్షులు శివరంగ, జిల్లా సీనియర్ నాయకులు ప్రసాద్ శర్మ డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట గాంధీ విగ్రహం సమీపంలో ఎపి మెడికల్ సేల్స్ అండ్ రెప్రజెంటిటీ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకు వచ్చిన లేబర్ కోడ్ల ద్వారా అనేక కార్మిక చట్టాలు రద్దు అయ్యాయన్నారు. కార్మికుల హక్కులను కాలరాసే విధంగా ఉన్న లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలన్నారు. మెడికల్ ఫార్మా రంగంలో పనిచేస్తుండేవారికి తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. అందుకే ప్రతి ఒక్కరూ సంఘటితమై నాలుగు లేబర్ కోడ్‌లనురద్దు అయ్యేంతవరకు పోరాటం కొనసాగించాలని కోరారు. జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు బసవరాజు, షేక్షావలి ఇతర నాయకులు పాల్గొన్నారు.

జల సమర దీక్షకు భారీగా కదలిన రైతులు

ప్రజాశక్తి- సి బెళగల్ : జిల్లా కేంద్రంలో ధర్నా చౌక్ దగ్గర కర్నూలు ప్రగతి సమితి వ్యవస్థాపకులు శ్రీ హర్ష సోమవారం 48 గంటల దీక్ష చేపట్టారు. ఇందులో భాగంగా బెళగల్ కేంద్రం నుండి గ్రామాల నుండి సుమారు 100 మంది స్వచ్ఛందంగా కదిలారు. వాహనాల ద్వారా కర్నూలు ధర్నా చౌక్‌కు వెళ్ళే ముందు మీడియాలో గుండ్రేవుల రిజర్వాయర్ సాధన జరిగితే మండలమే కాకుండా కర్నూలుకు జిల్లా కు తాగు, సాగు నీరు , పంటలు సస్యశ్యామలంగా ఉంటాయని పేర్కొన్నారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి రైతుల సంక్షేమ కోరి గుండ్రేవుల రిజర్వాయర్ సాధనకు తక్షణమే పునాది వేయాలని కోరారు.

స్మశాన వాటిక వివాదంపై గ్రామస్తుల వినతి

ప్రజాశక్తి- వెల్దుర్తి : వెల్దుర్తి మండలం మాదార్ పురం గ్రామానికి చెందిన సర్వే నెంబర్లు 714/1ఏలో 3.87 ఎకరాల భూభాగం ప్రస్తుతం గ్రామ స్మశాన వాటికగా ఉపయోగిస్తున్నామని గ్రామ ప్రజలు తెలిపారు. కొంతమంది వ్యక్తులు ఆ భూమిని ఇతర ప్రయోజనాల కోసం వినియోగించేందుకు ప్రయత్నిస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామస్థులు సోమవారం తహసీల్దార్ చంద్రశేఖర్ వర్మకు వినతిపత్రం అందజేశారు. స్మశాన భూమిగా ఉన్నందున, ఆ భూమిని గ్రామ కంఠంలో విధిగా కేటాయించాలని తహసీల్దార్‌ను కోరారు.గ్రామ ప్రజల అభ్యర్థనపై అధికారులు తగిన చర్యలు తీసుకుంటారని ఆశాభావం వ్యక్తం చేశారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి-ఆదోని

వరి, వేరుశనగ పంటలను ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి తక్షణమే కనీసం మద్దతు ధరలకు కొనుగోలు చేయాలని సిసిఐ నిబంధనలను సడలించి పత్తి కొనుగోలు చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కె.వెంకటేశ్వర్లు, పత్తి రైతుల సంఘం జిల్లా కార్యదర్శి కె.మల్లయ్య డిమాండ్ చేశారు. సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వారు ఈ ఏడాది పత్తి వేరుశనగ వరి పంటల ధరలు పూర్తిగా తగ్గిపోయాయన్నారు. కనీస మద్దతు ధరలు అమలు కాకపోవడం వల్ల పెద్ద ఎత్తున రైతులు నష్టపోతున్నారన్నారు. సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసినప్పటికీ అవి ఏమాత్రం సరిపోవటం లేదన్నారు. సీసీఐ నిబంధనల పేరుతో రైతుల దగ్గర ఉన్న అరకొరగా పత్తిని కొనుగోలు చేస్తున్నారన్నారు. రైతుల దగ్గర ఉన్నటువంటి కొనుగోలు చేయడం లేదన్నారు. స్లాట్ బుక్ చేసుకోవడంలో చాలా ఇబ్బందులు పడుతున్నారు. నాణ్యమైన పత్తిని మాత్రమే కొనుగోలు చేసి తడిసిన గుడ్డి పత్తిని కొనడం లేదన్నారు. దీనివల్ల రైతులు అయిన కాడికి వ్యాపారస్తులు అమ్ముకొని తీవ్రంగా నష్టపోతున్నారు. అలాగే వరి పంట, వేరుశనగ పంటను రైస్ మిల్లులో కానీ మార్కెట్ యార్డ్ లో కానీ చాలా తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారు. వేరుశనగ పంట కనీసం మద్దతు ధర క్వింటాలకు రూ.7260 అమలు కావడం లేదన్నారు. ప్రభుత్వం తక్షణమే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి వరి, వేరుశనగ పంటలను కొనుగోలు చేయాలని అలాగే ఆదోనిలో వేరుశనగ గ్రేడింగ్ విధానాన్ని పూర్తిగా రద్దు చేయాలని కోరారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల ద్వారా పూర్తిగా పత్తి కొనుగోలు చేయాలన్నారు. ఆదోని సబ్ కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు హనుమంతు, యోహాన్ పాల్గొన్నారు.

అధికారికి సమస్యలను వివరిస్తున్న ఎపిరైతు సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్లు

మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ఆపాలి

-కోటి సంతకాల సేకరణలో ఆలూరు ఎమ్మెల్యే విరుపాక్షి

ప్రజాశక్తి - ఆస్పరి

కూటమి ప్రభుత్వం మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ విరమించుకోవాలని ఆలూరు ఎమ్మెల్యే బుసినే విరుపాక్షి డిమాండ్ చేశారు.సోమవారం మండల పరిధిలోని కైరుప్పల గ్రామంలో సర్పంచ్ తిమ్మక్క ఆధ్వర్యంలో ప్రభుత్వం వ్యతిరేకంగా కోటి సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా ప్రతిఒక్కరూ ముందుకు వచ్చి ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ విరమించుకునే వరకు పోరాడు దామని పిలుపునిచ్చారు. కరోనా సమయంలో వాలంటీర్ వ్యవస్థ పెట్టి ఇంటి వద్దకే వైద్య సేవలు అందించిన ఘనత మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డికి దక్కిందన్నారు.నిరుపేద ప్రజలకు వైద్యం అందించాల ని ఉద్దేశంతో రాష్ట్రంలో 17 ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రవేశపెట్టి, 5 మెడికల్ కాలేజీలను ప్రారంభించడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరణ చేస్తు,ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో సీఎం చంద్రబాబు నాయుడు విఫలమయ్యారన్నారు. మండలంలోని వైసీపీ నాయకులు కార్యకర్తలు గ్రామంలో ప్రతి ఇంటికి వెళ్లి కోటి సంతకాలు సేకరణ చేయాలని ఆదేశించారు. ముందుగా ఎమ్మెల్యేకు శాలువా కప్పి పూలమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మహానంది, ఆస్పరి, దేవన కొండ జడ్పిటిసిలు దొరబాబు, కిట్టు, సొసైటీ మాజీ చైర్మన్ గోవర్ధన్, వైసీపీ మండల కన్వీనర్ బసవరాజు, మాజీ మండల కన్వీనర్ పెద్దయ్య, యువత విభాగం తాలూకా అధ్యక్షులు అశోక్, సర్పంచ్ వెంకటేష్ పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణ కార్యక్రమంలో ఎమ్మెల్యే విరుపాక్షి

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : ఎమ్మెల్యే బివి

ప్రజాశక్తి - గోనెగండ్ల

రైతన్నల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వర రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తిప్పనూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన రైతన్న మీకోసంలో ఆయన వ్యవసాయ అధికారులతో కలిసి పాల్గొని రైతులు బజారి, నాగరాజుల ఇంటికి వెళ్లి వారితో మాట్లాడారు. అన్నదాత సుఖీభవ డబ్బులు జమయ్యాయా లేదా అని అడిగి తెలుసు కున్నారు. వ్యవసాయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, ఇబ్బందుల గురించి ఆరా తీశారు. రైతన్నల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ మణి మంజరి, డిటి రఘువీర, ఎడిఎ మహమ్మద్ ఖాద్రీ, ఎఒ హేమలత, వివిధ శాఖల అధికారులు, టిడిపి నాయకులు కౌలుట్లయ్య, రామకృష్ణ, ఏలియామండల కన్వీనర్ తిరుపతయ్య నాయుడు, బేతాళబడేసా, కున్నూరు రమణ, నజీర్ సాహెబ్, కైరవాడి తిమ్మారెడ్డి, వేముగోడు సాయినాథ్, జనసేన బాష, షేక్షావలి, మౌల, గౌండరహంతుల్లా, లింగం దిన్నె నాయుడు, జైపాల్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి.జయనాగేశ్వర్‌రెడ్డి

ఎమ్మిగనూరు : రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని టిడిపి మండల కన్వీనర్ కేటీ వెంకటేష్ పేర్కొన్నారు. కె-తిమ్మాపురం గ్రామంలో నిర్వహించిన రైతన్న మీకోసంలో ఆయన పాల్గొని రైతుల ఇంటింటికి వెళ్లి రైతు క్షేమం గురించి వివరించారు. రైతులకు ప్రభుత్వం ద్వారా అందే ప్రతి సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ వ్యవసాయాన్ని లాభసాటిగా తీసుకువచ్చేలా సిఎం చంద్రబాబు నాయుడు తీసుకునే నిర్ణయాలను తెలిపారు. రైసేవా కేంద్రం అధికారి హజారుద్దీన్, వెటర్నరీ అధికారి లలితశ్రీ, ప్రకృతి వ్యవసాయ అధికారి పద్మ, పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు మండలంలో రైతన్న మీకోసం

దేవనకొండ : మండల పరిధిలోని మాచాపురం గ్రామంలో నిర్వహించిన రైతన్న మీకోసంలో ఎఒ ఉషారాణి పాల్గొని ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. సుస్థిర వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానంతో వ్యవసాయం లాభదాయకంగా ఉండేలా తీసుకోవాల్సిన సలహాలు, సూచనలు చేశారు.

మంత్రాలయం : రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని టిడిపి పట్టణ ఇన్‌ఛార్జ్ బి. వరదరాజులు తెలిపారు. స్థానిక సంత మార్కెట్ వద్ద ఉన్న కాలనీలో అన్నధాత సుఖీభవ, పిఎం కిసాన్ యోజన పథకం నిధులు రైతుల బ్యాంక్ ఖాతాల్లో జమ అయ్యాయా లేదా అనే విషయాన్ని ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి అడిగి తెలుసుకున్నారు. మంచాల సొసైటీ డైరెక్టర్ చాపల నాగేష్ మండల పరిధిలోని చెట్నిహల్లి గ్రామంలో రైతన్నా మీ కోసంలో పాల్గొని ప్రభుత్వం అందిస్తున పథకాల గురించి రైతులకు వివరించారు. నాయకులు అశోక్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ డీసీ తిమప్ప, మండల సెక్రటరీ కె. నరసింహులు, నాయకులు సిద్దు, విలేజ్ హార్టీకల్చర్ అసిస్టెంట్ బాలు, పశుశాంవర్ధక శాఖ విహెచ్ఎ అఖిల, టిడిపి గ్రామ అధ్యక్షులు చాకల నరసింహులు, పెద్ద కమిటీ చైర్మన్ పరమేష్ పాల్గొన్నారు.

నందవరం :రైతుల సంక్షేమం కోసం రైతన్న మీ కోసం' కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిందని మండల వ్యవసాయ అధికారిని సరిత తెలిపారు. కార్యక్రమన్ని జిల్లా పరిషత్ మాజీ వైస్ చైర్మన్ పుష్పవతి ఆధ్వర్యంలో గ్రామంలో నిర్వహించారు. ఇంటింటికి తిరిగి వ్యవసాయ అభివద్ధిపై ప్రజలకు అవగాహన కల్పించారు. పుష్పావతి మాట్లాడారు.రైతుల అభివద్ధి కొరకు చంద్రబాబు ఈ కార్యక్రమాన్ని చేపట్టా రన్నారు. వ్యవసాయ శాఖ సిబ్బంది ఖాజా హుస్సేన్, మనోహర్ రాజు, మస్తాన్, రహిమాన్ భాష, రఫీక్, ముత్తు పాల్గొన్నారు.

నందవరం మండలంలో రైతన్నా మీకోసం కార్యక్రమం

రైతును అన్ని విధాల ఆదుకుంటాం

- టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని : రైతు సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వ పాలన సాగుతోందని టిడిపి సీనియర్ నాయకులు ఉమాపతి నాయుడు తెలిపారు. ఆదోని మండలం అరెకల్ గ్రామంలో ఉమాపతి నాయుడు ఆధ్వర్యంలో రైతన్న మీకోసం - మన మంచి ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. అధికారులతో కలిసి గ్రామంలో ఇంటింటికి వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం చేశారు. ఉమాపతి నాయుడు మాట్లాడుతూ రైతుల సమస్యలను నేరుగా తెలుసుకుని, వారికి ప్రభుత్వ సేవలను చేరువ చేయడమే లక్ష్యంగా చేపట్టిన రైతన్న మీకోసం' ఈ నెల 30 తేదీ వరకు నిర్వహిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు పర్యటిస్తారన్నారు. వివిధ శాఖల అధికారులు,సిబ్బంది ప్రతి ఇంటికి వెళ్లి రైతులను కలుస్తారు. రైతులకు వ్యవసాయంలో లాభసాటి విధానాలైన పంచసూత్రాలను వివరిస్తారని సమస్యలు ఏవైనా ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. టిడిపి నాయకులు జిందే శంకర్, రాష్ట్ర హౌసింగ్ డైరెక్టర్ రామకృష్ణ, రంగస్వామి నాయుడు, రాష్ట్ర బెస్త కార్పొరేషన్ డైరెక్టర్ రామంజి, లక్ష్మీ నారాయణ, పాల్గొన్నారు.

ఆదోని జిల్లా ఏర్పాటుకు అందరి సహకారం అవసరం

ప్రజాశక్తి - ఆదోని

వెనకబడ్డ ఆదోని అభివృద్ధి జిల్లాతోనే సాధ్యమని ఎమ్మార్పీఎస్ ఆదోని నియోజకవర్గ ఇన్చార్జి బండారి గిడ్డయ్య తెలిపారు. ఆదోని జిల్లా ఏర్పాటు చేయాలని మేజర్ గ్రామమైన పెద్ద హరివానమును మండలంగా గుర్తించాలని కోరుతూ గ్రామస్తులు చేపట్టిన దీక్ష 8వ రోజుకు చేరింది. మున్సిపల్ మైదానం నుండి ఎమ్మార్పీఎస్ నాయకులు కోట్ల సర్కిల్లోనే ఏర్పాటుచేసిన శిబిరం వద్దకు మున్సిపల్ మైదానం నుండి ర్యాలీగా వచ్చారు. ఎమ్మార్పీఎస్ ర్యాలీకి మండల సాధన కమిటీ కన్వీనర్ ఆదినారాయణ రెడ్డి స్వాగతం పలికారు. ఆదోని నియోజకవర్గం ఇంచార్జ్ గిడ్డయ్య, ఎంఎస్పి కర్నూలు జిల్లా అధికార ప్రతినిధి బండారి హనుమంతు మాదిగ, జిల్లా నాయకులు పి ఎస్ విరేష్ మాదిగ మాట్లాడారు. కార్యక్రమంలో ఆదోని జిల్లా సాధన సమితి, పెద్ద హరివనం మండల సాధన సమితి నాయకులు ఎంఆర్పిఎస్ నాయకులు కార్యకర్తలు ఆదోని టౌన్ ఇన్చార్జి గుమ్మల బాలస్వామి, మాజీ పట్టణ అధ్యక్షులు మాధస్ జగన్ మాదిగ, ఆదోని టౌన్ కో కన్వీనర్జీ దత్తు మాదిగ ఎమ్మార్పీఎస్ మాజీ అధికార ప్రతినిధి నరసింహులు మాదిగ పాల్గొన్నారు.

దీక్షలలో పాల్గొన్న జిల్లా సాధనకు చేపట్టిన నిరసన దీక్షలో నాయకులు

విద్య ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు

- ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు : దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన ఎన్ డి ఏ ప్రభుత్వం విద్యారంగాన్ని పూర్తిగా విస్మరిస్తూ, విద్యను కాషాయీకరణ దిశగా నడిపిస్తున్నదని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప అన్నారు. సోమవారం ఎమ్మిగనూరులోని కెవిపిఎస్ కార్యాలయంలో ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు విజయ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు గోవిందు, రాముడు, తిమ్మన్న మాట్లాడుతూ విద్యను రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం, అలాగే ప్రైవేటీకరణ పేరుతో విద్యను కార్పొరేట్ వర్గాల చేతుల్లోకి నెట్టడం వల్ల పేద, మధ్యతరగతి విద్యార్థులకు విద్య అందని ద్రాక్షగా మారిందని పేర్కొంది. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన విద్యా విధానం మసిపూసి మారేడు కాయ లా వుందన్నారు. విద్యా హక్కు చట్టానికి విరుద్ధంగా రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరించే విధంగా ఎన్ఈపి రూపొందించబడిందని తెలిపింది. ఒకే స్కూల్లో అంగన్వాడి నుంచి ఇంటర్ వరకూ మూడు రకాల పాఠశాలలు ఏర్పాటు చేయడం, తొమ్మిదో తరగతి వరకు ఉన్న 'నో డిటెన్షన్ పాలసీ'ను రద్దు చేయాలని యోచించడం విద్యార్థుల భవిష్యత్తుకు హానికారకమని పేర్కొంది. దీని వల్ల వేలాది మంది విద్యార్థులు చదువుకు దూరమయ్యే ప్రమాదం వుందన్నారు. విద్యను మాతృభాషలో బోధించాలనే చట్టం ఉన్నప్పటికీ, కేంద్రం, రాష్ట్రాలు ఇంగ్లీష్ మీడియం తప్ప నిసరిగా అమలు చేయడంపై పట్టుబట్టి, మాతృ భాష విలువను తగ్గిస్తున్నాయన్నారు. నంతరం నూతన 23 మందితో పట్టణ కమిటీ ఎన్ను కున్నారు. అధ్యక్షులుగా యుగేందర్ రెడ్డి కార్యదర్శులుగా రాము ఉపా ధ్యక్షులుగా దేవన్స్, రామాంజనేయులు, బాలు, సహాయ కార్యదరి యశ్వంత్, చందు, తలహా,సోమశేఖరను ఎన్ను కున్నారు.

గౌరవనీయులైన సీనియర్ సివిల్ జడ్జ్ కోర్ట్: ఆదోని
I.P.No.23/2025
(దివాళాకోరుగా ప్రకటించుట కొరకు)

బీట్ వీన్ :-
ధరురి రామనారాయణ S/o లేట్ డి.వెంకట నారప్ప, ఇంటి నెం.3/10, ఖాజిపురం కొట్టల గ్రామము, ఖాజిపురం పోస్ట్, చిప్పగిరి మండలం, కర్నూలు జిల్లా. ...పిటిషనర్/వాది

మరియు

1. సి.కిరణ్ కుమార్ S/o సి. శ్రీనివాసులు, ఇంటి నెం.1-52, గుంతకల్ కొట్టల గ్రామము, మరియు పోస్ట్ గుంతకల్ మండలం అనంతపురం జిల్లా
2. బి.కె. నెట్టికంటయ్య S/o బి.కె.అంజినయ్య, ఇంటి నెం.22/378, ఎరుకుల స్ట్రీట్, రాగిమణ్ రోడ్డు, పాత గుంతకల్, అనంతపురం జిల్లా.
3. బి.నవీన్ కుమార్ S/o రాజు @ చిరు, నీయర్ హంపయ్య స్కూల్ హనుమన్ నగర్, బళ్ళారి టౌన్, బళ్ళారి జిల్లా
4. రుసేశ్వర్ రెడ్డి S/o శివ రెడ్డి, ఇంటి నెం. 275, ఎపి.హెచ్.యం.ఐ, జి.49, హౌసింగ్ బోర్డ్ కాలని, పాత గుంతకల్, అనంతపురం జిల్లా.
5. యస్.ఆర్. వెంకట రెడ్డి S/o గోవిందప్ప, ఇంటి నెం.233, ఎపి. హౌసింగ్ బోర్డ్ కాలని, ప్లాట్ నెం.81, స్ట్రీట్ నెం.100, గుంతకల్ టౌన్, అనంతపురం జిల్లా
6. బి.రాజగోపాల్ నాయిడు S/o పెద్ద రంగయ్య, ఖాజిపురం గ్రామము మరియు పోస్ట్ చిప్పగిరి మండలం, కర్నూలు జిల్లా
7. యం. వెంకటరాముడు S/o వెంకటయ్య, ఖాజీపురం గ్రామము మరియు పోస్ట్ చిప్పగిరి మండలం, కర్నూలు జిల్లా
8. శ్రీమతి కె.రాజమ్మ W/o వెంకటపతి,, ఖాజిపురం గ్రామము మరియు పోస్ట్ చిప్పగిరి మండలం, కర్నూలు జిల్లా
9. బి. శ్రీనివాసులు S/o బి.పెద్ద రంగయ్య, ఖాజిపురం గ్రామము మరియు పోస్ట్ చిప్పగిరి మండలం కర్నూలు జిల్లా
10. డి.రామస్వామి S/o లేట్ డి.నారప్ప, ఖాజిపురం గ్రామము మరియు పోస్ట్ చిప్పగిరి మండలం, కర్నూలు జిల్లా
11. శ్రీమతి పుష్పలత D/o లేట్ యల్.రామయ్య, ఖాజిపురం గ్రామము మరియు పోస్ట్ చిప్పగిరి మండలం, కర్నూలు జిల్లా
12. కె.రాజేష్ S/o క్రిష్ణమ నాయుడు, ఇంటి నెం.22/25, ఎ.బి.పోతప్ప కట్ట మెన్ రోడ్డు, పాత గుంతకల్, అనంతపురం జిల్లా.
13. కె.రమేష్ S/o కె.గోపాల్ నాయుడు, ప్లాట్ నెం.68, అయ్యప్ప కాలని, రాఘవేంద్ర కాలని, 2వ స్టాప్, బళ్ళారి టౌన్ బళ్ళారి జిల్లా
14. బి.రామకృష్ణ S/o రామంజినేయులు, రెడ్డి బజారు, రాగిమాణ్ కట్ట, పాత గుంతకల్ అనంతపురం జిల్లా
15. సి.నాగేష్ S/o కృష్ణ మూర్తి, గుంతకల్ కొట్టల గ్రామము మరియు పోస్ట్ గుంతకల్ మండలం, అనంతపురం జిల్లా
16. విరుపాక్షి రెడ్డి S/o శీవ రెడ్డి, ఇంటి నెం.20/207/2, గంగా నగర్ ఎదురుగా, డి.యస్.పి.బంగ్ల రోడ్డు, గుంతకల్ టౌన్, అనంతపురం జిల్లా.
17. బి. మాదుసూధన్ రెడ్డి S/o లక్ష్మి రెడ్డి, నరసపురం గ్రామము మరియు పోస్ట్, సింగణమళ మండలం అనంతపురం జిల్లా
18. బి.రంగప్ప S/o బోజ్జలి, ఏరూరు గ్రామము మరియు పోస్ట్, చిప్పగిరి మండలం, కర్నూలు జిల్లా
19. తిమ్మప్ప S/o రామప్ప, పొలగుట్ట గ్రామము మరియు పోస్ట్, గుంతకల్ మండలం, అనంతపురం జిల్లా
20. క్రిష్ణ ఫర్టిలైజర్స్ రెప్రెజెంటేడ్ బై ఇట్స్ ప్రొప్రైటర్ క్రిష్ణ తండ్రి పేరు తెలియదు, ఇంటి నెం.12/378, బస్ స్టాండ్ ఎదురుగా, గుంతకల్ టౌన్, అనంతపురం జిల్లా
21. వెంకటేశ్ కెమికల్స్ రెప్రెజెంటేడ్ బై ఇట్స్ ప్రొప్రైటర్ వెంకటేష్ తండ్రి పేరు తెలియదు, ఇంటి నెం.20/3, రిగల్ టాకిస్ ఎదురుగా, గుంతకల్, అనంతపురం జిల్లా
22. సి.మాధు S/o సి.సత్యనారయణ, ఇంటి నెం.116/76, 23వ వార్డ్, గంధంగ్ స్ట్రీట్, కె.యి.పి.ఎదురుగా, కౌల్ బజార్, బళ్ళారి టౌన్, బళ్ళారి జిల్లా.
23. డి.హరి S/o డి.గోపాల్, ఖాజిపురం గ్రామము మరియు పోస్ట్ చిప్పగిరి మండలం, కర్నూలు జిల్లా
24. రత్నక్రిష్ణ మూర్తి S/o గోవిందప్ప, గడెకల్ గ్రామము మరియు పోస్ట్, విడపానకల్ మండలం, అనంతపురం జిల్లా.
25. బి.రామ్ బాబు S/o బట్ట పుల్లయ్య, ఖాజిపురం గ్రామము మరియు పోస్ట్ చిప్పగిరి మండలం, కర్నూలు జిల్లా. ...రెస్పెడెంట్స్/ప్రతివాదులు

జనరల్ నోటీసు టు పబ్లిక్

ఇందుమూలముగా యావత్మంది ప్రజానికానికి తెలిజేయడం ఏమనగా పైన తెలుపబడిన పిటిషనర్ (వాది) అయిన ధరురి రామనారయణ S/o లేట్ డి.వెంకటనారప్ప, ఖాజిపురం కోట్టల గ్రామము మరియు పోస్ట్ చిప్పగిరి మండలం కర్నూలు జిల్లా వాసుడైన పై దివాల దావాను పై కోర్టులో (దివాలగా డిక్లరేషన్ చేయమని కేసు దాఖలు చేసియున్నారు). కావున ఇందుకు గాను ప్రతివాదులు అయిన మీకు మరియు యితరులకు ఏవ్వరికైన అక్షేపాణులు లేద అభ్యంతరలు వున్నయెడల పైతేదిన 31-12-2025 ఉదయం 10:30 గంటలకు పై కోర్టు యందు హాజరుయై స్వాయంగా గాని ప్లీడర్ ద్వార గాని హాజరై మీ యొక్క అక్షేపానులు తెలియపర్చుకోను వచ్చును. లేనియెడల కోర్టు వారు పరోక్షముగా ఫిటిషనర్ (వాదిపరంగా) గా తీర్మాణం చేయబడును.

(ఇట్లు కోర్టు ఉత్తర్వుల మేరకు)

బి. లక్ష్మికాంత్,
సి. ప్రవీణ్ కుమార్
ఫిటిషనర్(వాది) తరుపున న్యాయవాదులు
ఆలూరు/ ఆదోని
Cell No.9490516972, 8008640346

స్థానిక నాయకులతో ఎమ్మెల్యే బూసిన విరుపాక్షి

అండగా ఉంటాం.. కష్టపడి పనిచేయండి

- ఎమ్మెల్యే బూసిన విరుపాక్షి

ప్రజాశక్తి - చిప్పగిరి

నాయకులు, కార్యకర్తలు కష్టనష్టాలు అన్నీ కూడా మాకు బాగా తెలుసునని పార్టీ కోసం కష్టపడి పని చేయాలని, అన్ని రకాలుగా మీకు అండగా నిలబడతామని ఎమ్మెల్యే బూసిన విరుపాక్షి కార్యకర్తలకు నాయకులకు భరోసా ఇచ్చారు. సోమవారం ఎమ్మెల్యే బూసిన విరుపాక్షి క్యాంపు కార్యాలయంలో హలహరివి మండలానికి చెందిన కమ్మ సామాజిక వర్గం నుంచి దాదాపు 30 కుటుంబాలు మరియు చిప్పగిరి ఎస్సీ కాలనీలోని కాంగ్రెస్ కు చెందిన 15 కుటుంబాలు మరియు కాజీపురము గ్రామానికి చెందిన 10 కుటుంబాలు ఎమ్మెల్యే విరుపాక్ష ఆధ్వర్యంలో ఆయన చేత వైసిపి కండువా వేయించుకొని వైసీపీ పార్టీలోకి చేరమని పార్టీలోకి చేరిన నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ కోసం పనిచేసిన సామాన్య కార్యకర్తలకు మేలు చేసే గుణం పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డికి ఉందన్నారు. అధినేత ఏ కార్యక్రమము నిర్వహించిన మనమందరం ఐకమత్యంతో ఆ కార్యక్రమాలను విజయవంతం చేసుకుందా మన్నారు. భవిష్యత్తు మనదే అని ఎవరు కూడా అధైర్య పడవద్దన్నారు.

రెగ్యులర్ కార్యదర్శిని నియమించండి : సిపిఎం

ప్రజాశక్తి - ఆలూరు

నియోజవర్గ కేంద్రమైన ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీకి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శిని నియమించాలని సిపిఎం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎం ఆధ్వర్యంలో ఆలూరు ప్రాంతీయ కార్యదర్శి పి.హనుమంతు, కృష్ణలు ఎంపిడిఒ మద్దిలేటి స్వామికి సోమవారం వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గతేడాది నుండి ఆలూరు మేజర్ గ్రామ పంచాయతీకి రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శి లేకపోవడంతో డ్రెయినేజీ కాల్వలు, వీధిలైట్లు, తాగునీరు తదితర సమస్యలను పట్టించుకునే పరిస్థితిలో పంచాయతీ అధికారులు లేరని మండిపడ్డారు. గ్రామంలోని అనేక కాలనీలలో పది రోజులైనా మంచినీళ్లు రావడం లేదని, ఒ.హెచ్.ఎస్.ఆర్ వాటర్ ట్యాంకులను శుభ్రం చేయడం లేదని, డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్థంగా మారిందన్నారు. దోమల బెడద విపరీతంగా ఉందని, సిద్దేశ్వర కాలనీలో వీధిలైట్లు వేయాలని సంబంధిత అధికారులను అడిగినా పట్టించుకునే నాథుడే లేడన్నారు. సమ స్యలను పరిష్కరించాలని అడిగితే.. నేను ఇన్‌ఛార్జీ సెక్రటరిని, పంచా యతీలో డబ్బులు లేవని నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారని తెలిపారు. వెంటనే ఆలూరు మేజర్ గ్రామ పంచా యతీకి రెగ్యులర్ పంచా యతీ కార్యదర్శి నియ మించాలని డిమాండ్ చేశారు. నాయకులు విఠల్, రమేష్, ఎల్లప్ప పాల్గొన్నారు.



నల్లగా మారిన చెరువు నీళ్లు

- ఆందోళనలో గ్రామస్తులు - పరిశీలించిన అధికారులు

ప్రజాశక్తి - గోనెగండ్ల : మండలంలోని కులుమాల గ్రామంలో రంగు మారిన చెరువు నీటి సమస్యపై ప్రమాదం పొంచి ఉందని గ్రామస్తులు సోమవారం భయాందోళన చెందారు. గ్రామస్తుల విన్నపాలం మేరకు ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ విద్యాసాగర్ కులుమాల చెరువును సర్పంచి బుడ్డన్న సమక్షంలో పరిశీలించారు. రంగు మారిన చెరువు నీటిని పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపినట్లు డిఇ తెలిపారు. చెరువు సమీపంలో ఉన్న మూడు చేతి పంపుల నీటిని సైతం పరీక్షలకు పంపినట్లు పేర్కొన్నారు. అనంతరం డిఇ మాట్లాడుతూ రంగు మారిన నీటిపై వచ్చిన వదంతులపై ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని గ్రామస్తులకు సూచించారు. కలుషిత నీటి నుంచి ప్రమాదం ఉన్నట్లయితే ఆ చెరువులో ఉన్న చేపలు, ఆ నీటిని తాగిన జీవరాసులకు ఎలాంటి నష్టం జరగలేదని తెలిపారు. అనవసరంగా రంగు మారిన నీటిపై ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. నీటి పరీక్షల్లో వచ్చే ఫలితాలను బట్టి తగు చర్యలు తీసుకుంటామని గ్రామస్తులకు తెలిపారు. చెరువును పరిశీలించిన వారిలో ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ శ్రీనివాస రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామదాసు, టిడిపి నాయకులు చాంద్ బాషా, వెంకటేశ్వర్లు, ఉల్లిగడ్డల రాముడు, దేవవరం, కృపావరం ఉన్నారు.

చెరువు నీటిని పరిశీలిస్తున్న ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ విద్యాసాగర్

27 నుండి ఉపాధి సామాజిక గ్రామ సభలు

ప్రజాశక్తి - దేవనకొండ

మండలంలో 2024 - 25 ఆర్థిక సంవత్సరానికి మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనుల సామాజిక తనిఖీ గ్రామసభలు 27వ తేదీన నుండి నిర్వహించనున్నట్లు మండల ఏపీఓ రాజు నాయక్ సోమవారం విలేకరులకు తెలిపారు.

27న మాచాపురం, గుడిమిరాల, 28న చెల్లెలచెలిమల, 29న బంటుపల్లి, బండపల్లి, డిసెంబర్ 2న బేతపల్లి, పాలకుర్తి, 3న కరివేముల, పి కోటకొండ, 5న వెంకటాపురం, 6న పల్లెదొడ్డి, గుండ్లకొండ, 11న నెల తలమరి, 12న పొట్లపాడు, కప్పట్రాళ్ళ, 13న కొత్తపేట, నల్లచెలిమల, 18న దేవనకొండ, జిల్లేడుబుడకల, 20న అలారుదీన్ని, 22న తెర్నేకల్, కరిడికొండ, 26న వెలమకూరు, 27న ఐరన్ బండ, జనవరి 7న కుంకనూరు గ్రామాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కింద జరిగిన పనుల పరశీలన, సామాజిక తనిఖీలు, గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

వీఆర్ఏల కనీస వేతనం పెంచాలి

ప్రజాశక్తి - ఆదోని : కనీస వేతనం అమలు చేయాలని దశాబ్దాలుగా కోరుతున్న ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదని వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షుడు రాజ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశారు సోమవారం ఆదోని సబ్ కలెక్టర్ ముందు సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా విఆర్ ఏ లు ఆదోని సబ్ కలెక్టర్ కార్యా లయం ముందు ధర్నా నిర్వహిం చారు. వీఆర్ఏల సంఘం జిల్లా అధ్యక్షులు ఏ రాజ్ కు మార్ ఉపాధ్యక్షులు టి మల్లయ్య, సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి రామాంజనేయులు, తిప్పన్న మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా గ్రామ సేవకులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఈ సమస్యలను పరిష్కరిస్తామని గతంలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా ఇప్పుడు ఉన్నటువంటి ప్రభుత్వం కాలయాపన చేస్తుందని అన్నారు. గ్రామ సేవకులు ప్రధాన సమస్యలైన కనీస వేతనాలు నెలకు రూ26 వేలు ఇవ్వాలని, అర్హత గల వీఆర్ఏలకు ప్రమోషన్లు కల్పించాలన్నారు. వీఆర్ఏలకు అదనపు డ్యూటీలను వెయ్యరాదని. తక్షణమే పేస్కెలను అమలు చేయాలన్నారు. మా సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సిఐటియు నాయకులు బి వెంకటేష్ మండల అధ్యక్షుడు కోసిగి టి శాంత రాజు, టీ శివరాజు, టి ప్రభాకర్, పెద్ద కడుబుర్ మండల అధ్యక్షులు టి రమేష్, భీమన్న, హెూలుగుంద టీ జయప్ప ఇతరులు గ్రామ వీఆర్ఏలు పాల్గొనరు

సిఐటియు ఆధ్వర్యంలో ధర్నా చేస్తున్న నాయకులు

విద్యాదానానికి రూ. లక్ష విరాళం

- శ్రీ మఠం మేనేజర్ ఎస్కే శ్రీనివాసరావు

ప్రజాశక్తి మంత్రాలయం

ప్రముఖ ఆధ్యా త్మిక పుణ్యక్షేత్రమెన మంత్రాల యంలోని శ్రీ రాఘ వేంద్రస్వామి మఠంలో నిర్వహిస్తున్న శ్రీ గురు సార్వభౌమ సంస్కృత విద్యా పీఠంలో జరుగుతున్న విద్యాదానానికి బెంగళూరుకు చెందిన ధాత ఎన్. ప్రతిమ కుటుంబ సభ్యులు రూ. లక్ష విరాళం ఇచ్చినట్లు శ్రీమఠం మేనేజర్ ఎస్సే శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం వారు ఆలయాన్ని దర్శించుకొని శ్రీ మఠం నిర్వహణలో ఉన్న శ్రీ గురు సార్వభౌమ సంస్కత విద్యాపీఠంలో జరుగుతున్న విద్యాదానానికి లక్ష విరాళం ఇచ్చినట్లు తెలిపారు. ధాతకు శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు శేషవస్త్రం ఫల మంత్రాక్షింతలు అందజేసి ఆశీర్వదించారు.

పత్రికా ప్రకటన

నా క్లైంటు అయిన శ్రీమతి ఆముదాలపాడు రాజేశ్వరి, వయసు 63 సంవత్సరాలు భర్త ఎ.పి.జితేందర్ రెడ్డి ఇంటి నెంబర్ 65/2 ఆర్.టి.మునిసిపల్ కాలనీ, హైదరాబాద్ సిటీ, తెలంగాణ రాష్ట్రము. ప్రస్తుత నివాసము ఇంటి నెంబర్ 8-6-210/3 పద్మావతి కాలనీ, మహబూబ్‌నగర్ టౌన్, మహబూబ్‌నగర్ జిల్లా, తెలంగాణ రాష్ట్రము (ఆధార్ కార్డు నెంబరు 2680 69 25 2240) వారు కోరడము ఏమనగా ఇదివరలో అనగా 31-01-1986వ తేదీన శ్రీమతి ఆముదాలపాడు రాజేశ్వరి గారి పేరున మామిదాలపాడు సర్వే నంబర్లు దస్త్రత 55,56/1 ఈ సర్వే నంబర్లు గల భూముల యందు ఇండ్ల ప్లాట్లకు వేయబడిన సంతోష్ నగర్ కాలనీ నందలి ప్లాను దాఖల ప్లాట్ల పైకి నంబరు 150వ నెంబరు ప్లాటు స్థలమును సంతోష్ ఎస్టేట్ ట్రేడర్స్ కర్నూలు అను ఫార్మా తరపున మేనేజింగ్ పార్టనర్స్ అయిన (1) వై. బాలిరెడ్డి (2) బి.సి.శివరామిరెడ్డి గార్ల నుండి 31 -01-1986వ తేదీన తయారు చేయబడిన దస్తావేజును కర్నూలు జాయింట్ సబ్ రిజిస్టర్ వారి కార్యాలయము నందు 1వ పుస్తకము 780 వాల్యూం, 325ల 326 పుటలు, 966/1986 నంబరుగా రిజిస్టరు జరిగినది. కావున సదరు నెంబరు 150వ నెంబరు ప్లాటు స్థలముపై శ్రీమతి ఆముదాలపాడు రాజేశ్వరి గారికి పూర్తి హక్కులు కలిగి ఉన్నవి. కావున సదరు నెంబరు 150వ స్థలము పై ఇతరులకు ఎవరికైనా హక్కులు గానీ, అభ్యంతరములు గానీ ఏమైనా ఉన్నాయెడల 7 రోజులలోగా ఈ ప్రకటన చూసి ఫోన్ ద్వారా గాని నేరుగా గాని నన్ను సంప్రదించ గలరు.

ఇట్లు
ఎస్. నరేంద్ర నాథ్ రెడ్డి,
అడ్వకేట్,
ఇంటి నెంబర్ 41/366,
కొత్తపేట, కర్నూలు సిటి,
సెల్ నెంబర్ 94402 94473

ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించాలి

-జిల్లా ఎస్‌పి విక్రాంత్ పాటిల్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ద్విచక్ర వాహనం నడిపే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా హెల్మెట్ ధరించాల్సిందేనని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. సోమవారం కర్నూలు జిల్లా కేంద్రంలో ప్రజలకు రోడ్డు భద్రత , ట్రాఫిక్ రూల్స్ పై అవగాహన కల్పించేందుకు హెల్మెట్ , ఆటోల ర్యాలీని కర్నూలు ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ చేపట్టారు. హెల్మెట్ ధరించి ద్విచక్ర వాహనదారులు వాహనాలు నడిపే విధంగా అవగాహన కల్పించాలనే ఉద్దేశ్యంతో కర్నూలు కొండారెడ్డి బురుజు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎస్‌పి విక్రాంత్ పాటిల్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హెల్మెట్ అవగాహన ర్యాలీని ఎస్‌పి ప్రారంభించారు. ర్యాలీ జిల్లా పోలీసు కార్యాలయం నుండి ప్రారంభమై కంట్రోల్ రూమ్, కిడ్స్ వరల్డ్, రాజ్ విహార్,కలెక్టరేట్ మీదుగా సి. క్యాంపు సెంటర్ వరకు కొనసాగింది. ఎస్‌పి మీడియాతో మాట్లాడుతూ.... ట్రాఫిక్ పై అవగాహన కార్యక్రమంలో భాగంగా కర్నూలు ట్రాఫిక్ పోలీసులు రోడ్డు ప్రమాదాలు జరిగిన ఆడియోలను ఆవిష్కరించారు. రోడ్డు ప్రమాదాలలో హెల్మెట్ ధరించి ఉంటే చనిపోకుండా బతికి బయటపడే అవకాశం ఉండేదేమో అనే విధంగా భాధితుల కుటుంబాలు చెప్పారని, ఆ రోడ్డు ప్రమాదాల వీడియోలతో ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ద్విచక్రవాహనాలు నడిపే ప్రతి ఒక్కరూ భాద్యతగా హెల్మెట్ ధరించాల్సిందేన్నారు. మొదటి సారిగా జరిమానాలు విధించకుండా హెల్మెట్ ధారణ పై అవగాహన కల్పిస్తామన్నారు. తర్వాత కౌన్సిలింగ్ చేస్తామన్నారు. రాబోయే రోజులలో ద్విచక్ర వాహనదారులు ఐఎస్ఐ మార్క్ ఉన్న హెల్మెట్లను ధరించాల్సిందేనన్నారు. అందరూ హెల్మెట్లు కొనుగోలు చేసి బైకులు నడిపే విధంగా, హెల్మెట్లు వినియోగించే విధంగా సమయం ఇస్తామన్నారు. సాయంత్రం వేళల్లో పట్టణంలోని రద్దీ ప్రాంతాలు, ట్రాఫిక్ జంక్షన్‌లలో రోడ్డు ప్రమాదాలకు సంబంధించిన వీడియోలతో పోలీసులు ప్రజలకు అవగాహన కల్పిస్తారన్నారు. రోడ్డు భద్రత పై ప్రజలలో అవగాహన కల్పించేందుకు ర్యాలీలు , అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి పౌరుడు తన భద్రతకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. రోడ్డు ప్రమాదాలను తగ్గించేందుకు డ్రంకెన్ డ్రైవ్ తనిఖీలు, ఒపెన్ డ్రింకింగ్ తనిఖీలు చేపడుతున్నారన్నారు. ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణమోహన్ , కర్నూలు డిఎస్‌పి బాబు ప్రసాద్ , సిఐలు మన్సూరుద్దీన్, విక్రమసింహా, తేజామూర్తి, చంద్రబాబునాయుడు, మధుసుధన్ రావు, పార్ధసారథి, ఆర్ఐలు, ఎస్ఐలు ఆర్ఎస్ఐలు, ట్రాఫిక్ పోలీసులు, సివిల్, ఎఆర్ ,ఆయా షోరూం యువకులు, ఆటోల డ్రైవర్లు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలో బైక్ నడుపుతున్న ఎస్‌పి విక్రాంత్ పాటిల్, జెండా ఊపి ప్రారంభిస్తున్న ఎఆర్ అడిషనల్ ఎస్‌పి కృష్ణమోహన్

రెసిస్టెంట్స్ పై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

యాంటీ మైక్రోబియల్ రెసిస్టెన్స్ అవగాహన వారోత్సవాల(18-24)ముగింపు సందర్భంగా కర్నూలు మెడికల్ కాలేజీలో మైక్రోబయాలజీ డిపార్టుమెంట్, ఎన్ఎస్ఎస్‌ల ఆధ్వర్యంలో కాలేజీ నుండి హాస్పిటల్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఉద్దేశించి ముఖ్య అతిథి ఆసుపత్రి అడిషనల్ డిఎంఇ సూపరింటెండెంట్ డాక్టర్ కె.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మందులు వాడకంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. యాంటీ మైక్రోబియల్స్ వైద్యుల పర్యవేక్షణ లేకుండా వాడ కూడదని తెలిపారు. వైద్యుల పర్యవేక్షణ లేకుండా వాడితే సదరు మందులకు రెసిస్టెన్స్ ఏర్పడుతుందని దీనివల్ల అనేక దుష్పరిణామాలు ఏర్పడతాయని పేర్కొన్నారు. ఆంటీ బ్యాక్టీరియల్స్, వైరల్, ఫంగల్, పార సైట్ మందులు పూర్తిగా డాక్టర్ల పర్యవేక్షణలో వారు నిర్దేశించిన పరిమాణంలో నిర్దేశించిన సమయం వరకే ఉపయోగించాలని లేకపోతే సదరు మందులకు నిరోధక ఏర్పడితే చికిత్సలు కష్టంగా మారుతాయని అన్నారు. యాంటీ మైక్రోబియల్స్ జంతువులు విషయంలో ఆహార ఉత్పత్తుల విషయంలో విరివిరిగా విచ్చలవిడిగా వాడుతున్నారని దీని ద్వారా పర్యావరణాన్ని కూడా నష్టం ఏర్పడుతుందని కాబట్టి ప్రజలందరూ అవగాహన పెంచుకోవాలని కోరారు. మైక్రో బయాలజీ విభాగాధిపతి డాక్టర్ రేణుకా దేవి మాట్లాడుతూ ఆంటీ మైక్రోబెల్స్ పై మైక్రో బయాలజీ విభాగం ద్వారా ఏఎన్నార్ వారోత్సవాల సందర్భంగా సెమినార్స్, పోస్టర్ ప్రజెంటేషన్, క్విజ్ ఎల్యూయేషన్, అవగాహన రీల్స్‌లాంటి వివిధ కార్యక్రమాలను రూపొందించామని తెలిపారు. ర్యాలీలో లేత, నీలిరంగు బెలూన్లు ధరించి విద్యార్థులు యాంటీ 'మైక్రోబెల్స్ వైద్యుల సలహా లేకుండా వాడవద్దని' , 'నిర్దేశిత పరిమాణంలో వైద్యుల సూచనల మేరకే వాడాలని' కోరుతూ నినాదాలు ఇచ్చారు. ఎండోక్రైనాలజీ హెచ్ఒడి డాక్టర్ శ్రీనివాసులు, సిఎస్ఆర్ ఎంఒ డాక్టర్ పద్మజ, ఆర్ఎంఒ డాక్టర్ వెంకటరమణ, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శివబాల, నెఫ్రాలజీ విభాగపు వైద్యులు డాక్టర్ వెంకటప్పరెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కిరణ్ కుమార్, ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారి అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ అరుణ, మైక్రో బయాలజీ విభాగపు సిబ్బంది, హాస్పిటల్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ర్యాలీనుద్దేశించి మాట్లాడుతున్న డాక్టర్ వెంకటేశ్వర్లు

డయల్ యువర్ సిఎండి కి 65 వినతులు

-అత్యధికంగా కర్నూలు సర్కిల్ నుంచి 17 -ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి శివశంకర్ లోతేటి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విద్యుత్ వినియోగదారుల సమస్యల సత్వర పరిష్కారం కోసం సోమవారం డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమానికి 65 వినతులు అందినట్లు ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి తెలిపారు. తిరుపతిలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి కార్యక్రమం నిర్వహించారు. ప్రతి సోమవారం నిర్వహించే ఈ కార్యక్రమం ద్వారా తిరుపతి, చిత్తూరు, నెల్లూరు, కడప, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల వినియోగదారులు విద్యుత్ సమస్యలను సిఎండి దృష్టికి తీసుకువచ్చారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్ల మంజూరు, విద్యుత్ లైన్ మార్పు, కాలిపోయిన/ చోరీకి గురైన ట్రాన్స్ ఫార్మర్ల మార్పు, లో-ఓల్టేజ్ సమస్య, ట్రాన్స్ ఫార్మర్ల సామర్థ్యం పెంపు, ఇనుప విద్యుత్ స్తంభాల మార్పు, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తదితర సమస్యలు వీటిలో వున్నాయి. ఈ అంశాలపై వారికి సిఎండి శివశంకర్ లోతేట్ సమాధానమిస్తూ వినియోగదారుల సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంద్వారా 65 మంది వినియోగదారులు తమ విద్యుత్ సమస్యలను తెలియజేశారని, వాటిలో కర్నూలు సర్కిల్ నుంచి 17, తిరుపతి నుంచి 12, నెల్లూరు నుంచి 9, అనంతపురం నుంచి 7, కడప నుంచి 5, అన్నమయ్య నుంచి 5, నంద్యాల నుంచి 5, చిత్తూరు నుంచి 3. శ్రీసత్యసాయి సర్కిల్ నుంచి 2 వినతులు వున్నాయని వివరించారు. దీర్ఘకాలిక విద్యుత్ సమస్యలను తమ దృష్టికి తీసుకువస్తే, సాధ్యాసాధ్యాలను పరిశీలించి, వీలైనంత త్వరగా వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపడుతామని తెలిపారు.

ఈ కార్యక్రమం ద్వారానే కాకుండా వినియోగదారులు విద్యుత్ శాఖ టోల్ ఫ్రీ నంబర్లు: 1912 లేదా 1800 425 155333కు కాల్ చేయడం లేదా వాట్సాప్ సంబరు: 9133331912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావచ్చని తెలిపారు.

లేబర్ కోడ్లను రద్దు చేయాల్సిందే

ప్రజాశక్తి-పత్తికొండ

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం కార్మికుల కోసం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాల్సిందేనని సిపిఐ, సిపిఎం మండల కార్యదర్శి కారుమంచి, ,చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి కోరారు. సోమవారం ఈశ్వర రెడ్డి భవనంలో వామపక్ష పార్టీ , ప్రజా సంఘాల నాయకులు పత్రికా విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సిఐటియు మండల కార్యదర్శి రవిచంద్ర అధ్యక్షతన సిపిఎం మండల కార్యదర్శి చక్రాల వెంకటేశ్వర్ రెడ్డి, సిపిఐ మండల కార్యదర్శి కారుమంచి మాట్లాడారు. బ్రిటీష్ కాలంలో పోరాడి సాధించుకున్న కార్మికుల చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్స్‌గా మార్చి కార్మికులను బానిసలుగా కార్పొరేట్ పెట్టుబడిదారులకు ఊడిగం చేసే విధంగా ఉన్నాయన్నారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్స్ ను రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈనెల 26 న దేశవ్యాప్త సమ్మె సమ్మెను జయప్రదం చేయాలని కోరారు. సిఐటియు మండల అధ్యక్షులు గోపాల్, ఎఐటియుసి అధ్యక్ష కార్యదర్శులు రంగన్న, నెట్టికంటయ్య, రైతు సంఘం నాయకులు సిద్దు, కారప్ప, రాజుల కారప్ప, ఎస్ఎఫ్ఐ సెక్రెటరీ విష్ణు, సిపిఎం సీనియర్ నాయకులు దస్తగిరి, హమాలి వర్కర్స్ నాయకులు ఉరుకుందు, డివైఎఫ్ఐ అలిపిర ,మాదన్న ఆటో వర్కర్స్ నాయకులు ప్రశాంత్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న చక్రాల వెంకటేశ్వర్‌రెడ్డి

ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి సి.గురుశేఖర్

విశ్వకర్మ యోజన ద్వారా శిక్షణ ఇవ్వాలి

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్ : విశ్వకర్మ యోజన పథకం ద్వారాఆన్ లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారికి శిక్షణ ఇవ్వాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సి.గురు శేఖర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. న్యూ సిటీ కార్యదర్శి సి శేషాద్రి అధ్యక్షతన జరిగిన ధర్నానుద్దేశించి సి.గురు శేఖర్ మాట్లాడుతూ గూడూరు పట్టణంలో నివసిస్తున్న రజక వృత్తిదారులు సుమారు రూ.200 కుటుంబాలు ఉన్నాయన్నారు. విశ్వకర్మ కౌశల్య యోజన పథకం 2023వ సంవత్సరంలో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారన్నారు. వారికి శిక్షణ ఇచ్చి బ్యాంకు రుణాలు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్ ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ హామీ ఇచ్చారు. ఓల్డ్ సిటీ కార్యదర్శి సి.జయమ్మ, న్యూ సిటీ కార్యదర్శి శేషాద్రి, జిల్లా ట్రెజరర్ సిహెచ్ శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు మద్దిలేటి, గూడూరు పట్టణ నాయకులు సురేష్, ఎల్ల రాజు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

26 న ర్యాలీ, ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి -కర్నూలు కార్పొరేషన్

కర్నూలు నగరంలోని స్థానిక ఆర్ఎస్ రోడ్డు నుండి రైల్వే స్టేషన్ వరకు జరుగు నిరసన , ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సిఐటియు రాష్ట్ర కమిటీ సభ్యులు సిహెచ్ సాయి బాబా,జిల్లా నాయకులు టి. రాముడు, నగర అధ్యక్షులు నగేష్, ఉపాధ్యక్షులు సుధాకరప్ప సమావేశమై కార్మికులు ఉద్యోగులను కోరారు. సోమవారం స్థానిక కార్మిక కర్షక భవన్‌లో సిఐటియు నగర కమిటీ ఆఫీస్ బేరర్ల సమావేశం నిర్వమించారు. కేంద్ర కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు కర్నూలు నగరంలో కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన రైల్వే స్టేషన్ ముందు భారీ నిరసన తెలియజేస్తున్నామని తెలిపారు. కార్మికుల హక్కుల రక్షణ కోసం కేంద్ర కార్మిక సంఘాలు రైతు సంఘాలు ఇచ్చిన పిలుపునందుకొని ఈనెల 26న ఉదయం 10 గంటలకు జరుగు నిరసన ర్యాలీ, రైల్వే స్టేషన్ ముందు జరిగే భారీ ధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న కెవి నారాయణ

దేశానికి మార్క్సిజం దిక్సూచి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

భారత దేశానికి మార్క్సిజం దిక్సూచి, సోషలిజం అజేయ మైందని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కెవి.నారాయణ వివరించారు. సోమవారం స్థానిక పాతబస్తీ హరి కిషన్ సింగ్ సూర్జిత్ భవన్ నందు ఎస్ఎండి షరీఫ్ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. కెవి.నారాయణ మాట్లాడుతూ కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్ట్ కార్యకర్తలు అందరూ ప్రజలతో మమేకమై నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. దేశంలో ప్రపంచంలో జరుగుతున్న పరిణామాలు గనుక మనం పరిశీలించినట్లయితే అనేక దేశాలలో నగరాలలో కమ్యూనిస్టు నాయకులు వామపక్ష అభిమానులు జరిగిన ఎన్నికలలో గెలుస్తూ వస్తున్నారని అది ఐర్లాండ్, లేదా న్యూయార్క్, వర్జీనియా, లేదా శ్రీలంక ,వియత్నం, చైనా, క్యూబా తదితర దేశాలు నగరాలతో పాటు మన భారత్లో చండీఘర్ సెంట్రల్ యూనివర్సిటీ జెఎన్‌యు యూనివర్సిటీ ఇలా కమ్యూనిస్టులు గెలుస్తా ఉన్నారని రాబోయేది భారతదేశానికి కూడా దిక్సూచి మార్క్సిజజమేనని, సోషలిజం అజయమని తెలిపారు. నగరంలో సమస్య ఎక్కడ ఉన్నా అక్కడ కమ్యూనిస్టు ఉండాలని, ఆ విధంగా మన దిన చర్యలో భాగం చేసుకోవాలని కోరారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేద మధ్యతరగతి ప్రజలపై వేస్తున్న భారాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలన్నారు. ఇక్బాల్, మూసమియా తదితరులు పాల్గొన్నారు.

బ్రోచర్ అందేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

రైతుకు భరోసా అన్నదాత సుఖీభవ

ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

రైతులకు అన్నదాత సుఖీభవ భరోసాగా నిలుస్తుందని కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి అన్నారు. సోమవారం కర్నూలు మండలం నిదుర గ్రామంలో పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ పథకాల కరపత్రాలను ఇంటింటికి తిరుగుతూ గ్రామంలో పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ హామీల్లో భాగంగా అన్నదాత సుఖీభవ పథకం కింద రైతులందరికీ ఏడాది రూ.20,000 ఆర్థిక సహాయం చేస్తామన్న హామీని నెరవేర్చేలా ప్రభుత్వం అడుగులు వేసిందన్నారు. పీఎం కిసాన్ అన్నదాత సుఖీభవ మొదటి విడతగా రూ.7000, రెండో విడతగా రూ.7000 రైతుల ఖాతాల్లో జమ చేసిన విషయాన్ని రైతులకు వివరించారు. కూటమి ప్రభుత్వం రైతుల పట్ల చేస్తున్న మేలును రైతులకు వివరించారు. ఎంపిడిఒ రఘునాథ్, అగ్రికల్చర్ ఆఫీసర్ రూపస్, టిడిపి మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్, మండల కూటమి నాయకులు, రైతులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

పే స్కేల్ వెంటనే అమలు చేయాలి

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

రెవెన్యూ శాఖలో పనిచేసే గ్రామ రె వెన్యూ సహాయకులకు పేస్కేల్ అమలు చేయాలని సిఐటియు జిల్లా నాయకులు ఎం.గోపాల్ డిమాండ్ చేశారు. సోమవారం కర్నూలు రెవెన్యూ డివిజనల్ అధికారి కార్యాలయం ఎదుట ఎపి గ్రామ రెవెన్యూ సహాయకుల సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. జిల్లా నాయకులు రాజు అధ్యక్షతన జరిగిన ధర్నాలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.గోపాల్ ,ఆ సంఘం జిల్లా కార్యదర్శి అయ్య స్వామి మాట్లాడారు. అర్హత కలిగిన గ్రామ రెవెన్యూ సహాయకులందరికీ పదోన్నతి కల్పించాలని డిమాండ్ చేశారు. ఇతర సమస్యలను కూడా పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్‌కు ఆ సంఘం నాయకులు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు మద్దయ్య నాయుడు, కొండయ్య, తిరుపతి ,భాస్కరనాయుడు మద్దిలేటి ,ఉస్మాన్‌బాషా, రామ చంద్రుడు, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎం.గోపాల్

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం

-ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రైతులకు అండగా కూటమి ప్రభుత్వం ఉంటుందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత రెడ్డి అన్నారు. కల్లూరు మండలం చిన్నటేకూరు గ్రామంలో రైతు వ్యవసాయ శాఖ అనుబంధ శాఖల ఆధ్వర్యంలో రైతన్నా - మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే రైతుల ఇంటింటికి తిరిగి రైతన్నా-మీకోసం కరపత్రాలను పంపిణీ చేస్తూ కూటమి ప్రభుత్వంలో రైతులకు అండగా అమలు చేసిన పథకాల గురించి అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర కూటమి ప్రభుత్వం రైతన్నా-మీకోసం పంచ సూత్రాలతో చంద్రన్న వ్యవసాయ రంగంలో పెనుమార్పుల ద్వారా సాగును లాభసాటి చేసేందుకు ఈ నెల 24 నుండి 29 వరకు నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రభుత్వాల మద్దతు అనే పంచ సూత్రాల విధానంతో రైతులకు వ్యవసాయం గిట్టుబాటు కావాలి అనే లక్ష్యం తో కూటమి సర్కార్ అందిస్తోందని తెలిపారు. ఎంపిడిఓ నాగ శేషాచల రెడ్డి, మండల వ్యవసాయ అధికారి విష్ణు వర్ధన్ రెడ్డి, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ రామాంజనేయులు, సొసైటీ చైర్మన్‌లు ఉలిందకొండ ఇవి రమణ, పర్ల శేఖర్, తడకనపల్లి సర్పంచి సహరాబి, చిన్నటేకురు గ్రామ నాయకులు రామాంజనేయులు,శేషగిరి, రాజశేఖర్, అశోక్, లక్ష్మణ్ సచివాలయ ఉద్యోగులు, కూటమి పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

ఒకేషనల్ కోర్సులపై అవగాహన

ప్రజాశక్తి కర్నూలు కలెక్టరేట్

కర్నూలు నగరంలోని స్థానిక కట్టమంచి రామలింగారెడ్డి మున్సిపల్ స్మారక పాఠశాలలో విద్యార్థులకు ఒకేషనల్ కోర్సులపై సోమవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.నాగ స్వామి నాయక్,విద్యార్థులకు వృత్తి విద్యా కోర్సులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టి.వెంకట్ రెడ్డి, కళాశాల లెక్చరర్స్ ప్రసన్నకుమార్, విజయశేఖర్, సుజాత, గిరిజారాణి, లక్ష్మి, చిన్న మల్లేశ్వరుడు, ఉల్గొజీ రావు పాల్గొన్నారు.

రైతుల సంక్షేమానికి కూటమి కృషి : ఎంపి

ప్రజాశక్తి కర్నూలు క్రైమ్: రైతుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు అన్నారు. కర్నూలు రూరల్ మండలం పంచలింగాలలో రైతన్నా మీ కోసం లోపాల్గొన్నారు. రైతుల ఇంటింటికి వెళ్లి నీటి భద్రత, డిమాండ్ ఆధారిత పంటలు, అగ్రిటెక్, ఫుడ్‌ప్రాసెసింగ్, ప్రభుత్వ మద్దతు గురించి వివరించారు. కూటమి ప్రభుత్వం రైతులను ఆదు కుంటుందన్నారు. అధికారులు, టిడిపి నాయకులుపాల్గొన్నారు.

విఆర్‌ఎలకు విఆర్‌ఒలుగా ప్రమోషన్లు ఇవ్వాలి

సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.వి నారాయణస్వామి

ప్రజాశక్తి-పత్తికొండ

రాష్ట్ర ప్రభుత్వం విఆర్‌ఎల సమస్యలను తక్షణమే పరిష్కరించి విఆర్‌ఒలుగా ప్రమోషన్ ఇవ్వాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు కె.వి నారాయణ స్వామి డిమాండ్ చేశారు. సోమవారం పత్తికొండ ఆర్‌డిఒ కార్యాలయం ఎదుట విఆర్‌ఎల సమస్యలను పరిష్కరించాలని సిఐటియు నాయకులు ఆర్‌డిఒ డాక్టర్ భరత్ నాయక్‌కు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు నారాయణస్వామి మాట్లాడుతూ ఆంధ్ర ప్రదేశ్ రెవిన్యూ వ్యవస్థలో సుమారు 19,359 వేల మంది గ్రామ రెవెన్యూ సహాయకులుగా పనిచేస్తున్నారని, సుదీర్ఘకాలం నుండి చాలా తక్కువ వేతనాలతో పనిచేస్తున్న విఆర్‌ఎలకు విఆర్‌ఒలుగా ప్రమోషన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2018లో నాడు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు నాయుడు రూ.6,500 నుండి రూ.10,500కు వేతనం పెంచారని, డిఎ రూ.300 ఇచ్చారని గత ప్రభుత్వం డిఎని కూడా ఉపసంహరించి రికవరీ చేశారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం వచ్చాక అయినా జీతాలు పెరుగుతాయని ప్రమోషన్లు అమలు చేస్తారని విఆర్‌ఎల ఆశతో ఎదురు చూశారన్నారు. గత 16 నెలల కాలంలో కూటమి ప్రభుత్వం విఆర్‌ఎల సమస్యలు ఏ ఒక్కటి పరిష్కరించలేదని, అంతేకాకుండా నిబంధనలకు వ్యతిరేకంగా డ్యూటీలు వేస్తూ వారిపై పనిభారం మోపుతున్నారని అన్నారు. సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని ఆర్‌డిఒకు అందజేశారు. సిఐటియు పత్తికొండ మండలం కార్యదర్శి ఎం.రవిచంద్ర, విఆర్‌ఎల సంఘం నాయకులు చెన్నప్ప, తిమ్మ, చంద్రయ్య, హెచ్.భీమ లింగ హరీష్ కుమార్, సూరి, అంజి, అశోక్, దిన్ను, షరీఫ్ లింగన్న పాల్గొన్నారు

మాట్లాడుతున్న రాఘవేంద్ర

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

ఆర్‌డిఒ కార్యాలయం వద్ద నవంబర్ 25న నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని మండల ప్రజలకు సిపిఎం మండల నాయకులు రాఘవేంద్ర కోరారు. సిపిఎం మండల కమిటీ ఆధ్వర్యంలో మండల నాయకులు నరసింహ అధ్యక్షతన రెండవ రోజు జీపు జాతా దిన్నదేవరపాడు, పసుపుల, బి.తాండ్రపాడు, రుద్రవరం, పడిదంపాడు, పూడూరు, నూతనపల్లె, నందనపల్లె, శివరాంపురం, దిగువపాడు గ్రామాలలో జీను జాబితాను నిర్వహించామన్నారు. జీపు జాతాను ఉద్దేశించి సిపిఎం మండల నాయకులు రాఘవేంద్ర సీనియర్ నాయకులు భీసన్న మాట్లాడారు. కర్నూలు రైల్వే వ్యాగన్ వర్క్ షాప్ వెంటనే పూర్తి చేసి ఉపాధి కల్పించాలని మండల అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలన్నారు. మండలంలో తాగునీటి సమస్య పరిష్కారం చేయాలని డిమాండ్ చేశారు. కొత్త పెన్షన్లు, ఇంటి బిల్లులు వెంటనే మంజూరు చేయాలని ఇల్లు లేని పేదలకు స్థలం కేటాయించాలని ఇప్పటికే ప్రభుత్వ స్థలంలో కొట్టాలు వేసుకున్న పేదల గుడిసెలకు పట్టాలు మంజూరు చేయాలని. ఉల్లి రైతులకు ఇస్తామన్న రూ.50 వేల ఇవ్వాలని వివిధ రకాల సమస్యలతో రేపు ఉదయం 10 గంటలకు ఆర్‌డిఒ కార్యాలయం ముందు ధర్నాను మండల ప్రజానీకం పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. జీపు జాతలో మండల నాయకులు మస్తాన్, ప్రకాష్, హరి, కిషన్‌రెడ్డి,రాము పాల్గొన్నారు.

అర్జీల పరిష్కారంలో వేగం పెంచాలి

-నగరపాలక సంస్థ కమిషనర్ పి.విశ్వనాథ్

-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 23 అర్జీలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్‌యస్)లో వస్తున్న అర్జీల పరిష్కారాన్ని వేగవంతం చేయాలని నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ అధికారులను ఆదేశించారు. సోమవారం నగరపాలక సమావేశ భవనంలో నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు 23 అర్జీలు వచ్చాయి. వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కమిషనర్ తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ ఆర్‌జివి.కృష్ణ, డిప్యూటీ కమిషనర్ సతీష్ కుమార్ రెడ్డి, మేనేజర్ చిన్నరాముడు, ఇంచార్జీ ఎస్ఇ శేషసాయి, ప్రజారోగ్య అధికారి డాక్టర్ నాగశివ ప్రసాద్, ఆర్ఒ జునైద్, ఎంఇ మనోహర్ రెడ్డి, టిడ్కో అధికారి పెంచలయ్య, తదితరులు పాల్గొన్నారు.